# ఉత్తరం

ఆ ఉత్తరాన్ని ఆమె కనీసం డజను సార్లయినా చదివి ఉంటుంది. అయినా ఆమెకు తృప్తిగా లేదు. ఉత్తరం మడతలు విప్పినప్పుడల్లా అక్షరాలు నక్షత్రాల్లా జలజలా రాలి ఆమె ఒడిలో పడ్తున్నాయి. పాత జ్ఞాపకాలు జలపాతపు హోరులా ఆమెని ముంచెత్తుతున్నాయి.

అక్షరాల నిండా ఆత్మీయతని కూరి రాసిన ఉత్తరం అది. అందులోని ప్రతి పదం పరమాన్నంలా తీయగా ఉంది. ఒక్కో వాక్యం అమృతధారలా తన జవజీవాల్ని బలోపేతం చేస్తోంది. ఆ పదాలకు ప్రాణం ఉన్నట్లు – తమ మృదువైన పెదవుల్తో ఆమెని ప్రేమగా పల్కరిస్తున్నాయి.

అమెరికా నుండి ఆమె కొడుకు రవి రాసిన ఉత్తరం అది. దాన్నిండా పర్చుకున్న వాడి ఆలోచనలు . . . అనురాగం . . . వాక్యాలుగా మల్చుకున్న ఆత్మీయత. తన హృదయం చిదిమి అక్షరాలుగా పొదిగినట్లు . . . వాడి అందమైన మనసు పావురాయిలా మారి విహాయసాన ఎగిరి – కాగితం మీద వాలి – పదాలుగా ఒదిగినట్లు . . .

ఆమె పడుకోబోయే ముందు మరోసారి ఉత్తరాన్ని చదువుకుంది.

"అమ్మా! నీకు కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్నా నా ఆలోచనంతా నిన్నల్లుకుని ఉండిపోయిందమ్మా. అంత పెద్ద ఇంట్లో నువ్వొక్కదానివే ఒంటరిగా తిరుగాడుతుంటావన్న ఆలోచనే నాకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది. నేనెంత వద్దన్నా విన్నావు కాదు. నన్ను బలవంతంగా అమెరికాకు పంపించావు. ఏముందమ్మా ఇక్కడ? డాలర్ల మీది మోజుతో దగా పడిన సోదరులే అందరూ. ప్రేమనీ, ఆప్యాయతల్ని పంచే మనుషులకు దూరంగా . . . డాలర్లు సంపాయించే యంత్రాలు వీళ్ళు.

నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చిందని తెల్సి, నువ్వు మురిసిపోవటం గుర్తొస్తుందమ్మా. "మా రవి చాలా అదృష్టవంతుడు. వాడికి అమెరికాలో పెద్ద ఉద్యోగం దొరికింది" అని కన్పించిన ప్రతివాళ్ళకీ చెప్పావు. నిజంగా నేను అదృష్టవంతుణ్ణే . . . ఈ ఉద్యోగం దొరికినందుకు కాదు, నీలాంటి అమ్మ దొరికినందుకు. ఎన్ని జన్మల పుణ్యం చేసుకున్నానో . . . నీలాంటి గొప్ప స్త్రీకి కొడుగ్గా పుట్టాను.



అనురాగం అమ్మగా పుడితే నీలానే ఉంటుంది. నువ్వెంత కష్టపడి నన్ను చదివించావో నేనెప్పటికీ మర్చిపోలేనమ్మా! నాకు వరన్నం పెట్టడం కోసం నువ్వు జొన్న సంకటి తిన్న రోజులు నా మనసు మీద శిలాక్షరాలుగా ముద్రపడ్డాయి. నాన్నలేని లోటు తెలీకుండా నీ రెక్కలు ముక్కలు చేసుకుని నన్నింత వాణ్ణి చేశావు. నాకిక్కడ మనసు నిలవటం లేదమ్మా. మనోవేగంతో ఎగిరొచ్చి నీ ముందు వాలాలని ఉంది. నీ ఒడిలో తలపెట్టుకుని నీవు చెప్పే వూసులు వినాలని ఉంది. నీ చేతి గోరుముద్దలు తినాలని ఉంది.

ఒక్కసారి చెప్పమ్మా . . . వచ్చేయమని. ఈపాటి ఉద్యోగం నాకెక్కడైనా దొరుకుతుంది. ప్లీజ్ అమ్మా! నువ్వు దగ్గర లేకుండా ఎంత పెద్ద ఉద్యోగమైనా నాకొద్దు. వచ్చేయమని రాయమ్మా– నీ అనుమతి కోసం ఎదురుచూస్తూ . . . నీ రవి".

ఆమెకు కన్నీళ్ళు తిరిగాయి.

ఉత్తరాన్ని జాగ్రత్తగా మడిచి–దిండు కింద పెట్టుకుని కళ్ళు మూసుకుంది. తన బాబు అతి సమీపంగా తిరుగాడుతున్న అనుభూతి . . .

ఐదేళ్ళ పసివాడిగా తన పొట్టని కావలించుకుని, అల్లుకుని పడుకున్నట్లు . . .

వాడిప్పుడు తన కళ్ళకి స్పష్టంగా కన్పిస్తున్నాడు, తన అమాయకమైన నవ్వుని గదంతా పరిచి . . . ఆనందంతో కేరింతలు కొడుతున్నాడు. అల్లరితో మురిపిస్తున్నాడు.

దిండు కిందికి చేయి పోనిచ్చి కాగితపు మడతల్ని తడిమిందోసారి. వాడికి ఏడాది వయసున్నప్పుడు – గులాబీరేకుల్లా ఉన్న వాడి బుగ్గల్ని తడిమిన అనుభూతి ఆమెకు.

రవికి పదేళ్ళప్పుడు ఆమె భర్త టైఫాయిడ్ జ్వరంతో ప్రాణాలు విడిచాడు.

కొండంత దుఃఖాన్ని గుండెలపై మోస్తూనే, రవికోసం పిడికెడంత ధైర్యాన్ని కూడగట్టుకుంది. కలో గంజో తాగి కొడుకుని కష్టమనేది తెలీకుండా పెంచింది. వాడి చదువుకోసం నాలుగెకరాల మాగాణీ భూమిని అమ్మేసింది. ఆమె ఆస్తి తన కొడుకే. ఆమె అస్తిత్వం . . . ఆమె ఆశా, శ్వాసా అంతా తన కొడుకే . . .

రవి కూడా బాధ్యతగా చదువుకుని కంప్యూటర్స్‌లో ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. తన రవి అందరు పిల్లల్లా కాదు. వాడికి అనుబంధాల్లో ఉండే ఆర్ద్రత తెలుసు – మమకారాల్లోని మాధుర్యం తెలుసు. వాడిది చాలా సున్నితమైన మనసు.

తమ వూరి నుండి అమెరికా వెళ్ళి, ఉద్యోగాలు తెచ్చుకుని అక్కడే స్థిరపడ్డవారు ఏడెనిమిది మంది వరకూ ఉంటారు. అక్కడికెళ్ళాక, డాలర్ల మాయామోహంలో పడి, కళ్ళు కన్పడక అమ్మానాన్నల్ని, కన్నతల్లిలాంటి వూరిని మర్చిపోయిన వాళ్ళే అందరూ. రవి అలా కాదు.

వాడికి ఈ పల్లెటూరన్నా, తన కన్నతల్లన్నా అనంతమైన ఇష్టం.

ఏడాది తిరిగేసరికి శెలవుపెట్టి ఇంటికొచ్చిన రవితో, "నేనేమైపోతానోనని దిగులు పెట్టుకున్నావా పిచ్చితండ్రీ! నాకేం, నిక్షేపంలా ఉన్నాను. ఏవేవో వూహించుకుని బంగారంలాంటి ఉద్యోగాన్ని, మంచి భవిష్యత్తుని వదులుకోకు" అని నచ్చ చెప్పింది. వాడు తిరిగి వెళ్ళేలోపల మంచి అమ్మాయిని చూసి పెళ్ళిచేసింది. "నా కొడుకు నన్ను మర్చిపోయేంతగా వాణ్ణి ప్రేమించు. వాడి జ్ఞాపకాల్లో నువ్వు తప్ప నేనుండనంత అపురూపంగా చూసుకో" అంటూ ఆ అమ్మాయికి అప్పగింతలు పెట్టింది.

తీరా వాళ్ళు అమెరికా వెళ్ళిపోయాక ఆమెకు భయం పట్టుకుంది. 'నిజంగానే వీడు నన్ను మర్చిపోతాడా? భార్య మోజులో పడి నాకు దూరమై పోతాడా?' స్త్రీ సహజమైన అభద్రతా భావం ఆమెను అశాంతికి గురి చేసింది. అదంతా అర్థం లేని భయమనీ – తన రవి ఎప్పటికీ మారడని వాడినుంచి యథావిధిగా వారం వారం వచ్చి వాలిన ఉత్తరాలే సాక్షిగా నిలిచాయి.

"అమ్మా! నేను ఒంటరిగా ఉండి కష్టపడుతున్నానని నాకు పెళ్ళి చేశావు. నాకు తను తోడున్నా, నువ్వు లేని ఒంటరితనాన్ని ఎవ్వరూ దూరం చేయలేరమ్మా! పెళ్ళయాక నువ్వు మరీ గుర్తొస్తున్నావు. తను ఏ పనిచేసినా, అమ్మైతే ఇలా చేసేదా? ఇంకా బాగా చేసేది కదూ అన్పిస్తోంది. తను ఏం మాట్లాడినా అమ్మైతే ఇంకా ప్రేమగా మాట్లాడి ఉండేది అన్పిస్తోంది. ఇంత పెద్దయినా వీడు అమ్మకూచి అని నవ్వుకుంటున్నావు కదూ!

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! నాకెప్పుడూ నీ దిగులే. మన వూరికి టెలిఫోన్ కనెక్షన్ వస్తే బావుంటుంది. ప్రతిరోజూ నీకు ఫోన్ చేసి నీ యోగక్షేమాలు కనుక్కోవచ్చు. మన సిటీల్లో దొరికే అన్ని సౌకర్యాలు ఇక్కడి పల్లెటూర్లలో దొరుకుతాయి.

సౌకర్యాలకూ, సౌఖ్యాలకూ ఇక్కడ కొదువలేదమ్మా. కానీ మనుషుల మధ్య ఆప్యాయతలూ అనురాగాలే ఉండవు. అంతా డబ్బుతో ముడిపడి మెకానికల్ జీవితం . . . మరయంత్రాలు మాట్లాడ్తున్నట్లు . . . డాలర్ నవ్వులు . . . ఇదంతా మాయాజలతారు. రోబోలు కదుల్తున్నట్లే ఉంటుంది. అమ్మ అనేది అలౌకికమైన అనుభూతి అని ఇక్కడ చాలామందికి తెలియదు. అయినా అందరికీ నీలాంటి అమ్మ దొరకొద్దూ !

ఎన్ని జన్మలెత్తినా నువ్వే నాకు అమ్మగా కావాలని కోరుకునే – నీ రవి".

ఆ ఉత్తరాన్ని ఆమె కనీసం పాతిక సార్లయినా చదివి ఉంటుంది.

ఇప్పుడు ఆర్థికంగా ఏ లోటూ లేదు. వూళ్ళోనే పదెకరాల మాగాణి కొనుక్కున్నారు. ఇంట్లో కలర్ టీవీ ఉంది. టేప్ రికార్డర్ ఉంది. అయినా ఇవేవీ ఆమెకు ఆనందాన్నివ్వవు. రవి నుంచి

వచ్చిన ఉత్తరాలు చదువుకోవడంలో ఉన్న ఆనందం ఆమెకు ఎందులోనూ దొరకదు. అవి దొంతర్లు దొంతర్లుగా పేర్చిన అనురాగ తరంగాల్లా కన్పిస్తాయామెకు.

రవి నుంచి మరో ఉత్తరం వచ్చేవరకు ఆమె పాత ఉత్తరాల్ని తీసి, పదే పదే చదువుకుని మురిసిపోతూ ఉంటుంది.

వీడికి నేనంటే ఎంత ప్రేమ అనుకోగానే ఆమెకు కొండంత బలం వచ్చినట్లవుతుంది. ఉత్సాహం నరాల్లో ఉరకలు వేస్తుంది. ఆమెకు ఒంటరితనం అన్పించదు. రవి రాసిన ఉత్తరాలు ఆమెని పల్కరిస్తాయి. వాటిలోని అక్షరాలు ఆమెని పరామర్శిస్తాయి. అవి ఆమెని నవ్విస్తాయి. ఆనందం అవధులు దాటితే ఏడ్పిస్తాయి కూడా.

పెళ్ళయిన ఏడాదికి అమ్మను చూడాలని నెలరోజులు శెలవు పెట్టి వచ్చాడు రవి. ఊరికి కొత్తగా టెలిఫోన్ కనెక్షన్లు ఉండటం చూసి, ఇంట్లో టెలిఫోన్ పెట్టిస్తానన్నప్పుడు ఆమె సంతోషపడింది. తన రవి గొంతు వినొచ్చు. వాడితో బోల్డు కబుర్లు చెప్పొచ్చు. కోడలికి అవసరమైన సలహాలివ్వొచ్చు. ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలో అనుకుంది.

టేబిల్ మీద ఫోన్ గువ్వపిట్టలా ఒదిగి ఉండటం చూసి ఆమె ఎంత సంబరపడిందో! అమెరికా నుంచి రవి మొదటిసారి ఫోన్ చేసినప్పుడు ఆమెలో ఆపుకోలేనంత ఉద్వేగం !

"అమ్మా! ఎలా ఉన్నావు?" అన్నాడు రవి.

"బావున్నాను బాబూ! నువ్వూ, అమ్మాయి ఎలా ఉన్నారు?" అందామె.

"ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! ఏ కొద్ది నలతగా అన్పించినా ఫోన్ చేయి. డబ్బులు ఎక్కువవుతాయని ఆలోచించకు. నీకెన్నిసార్లు చేయాలనిపిస్తే అన్నిసార్లు చేయి. ఇదిగో నీ కోడలితో మాట్లాడు" అని ఫోన్ తన భార్యకిచ్చేశాడు.

తీరా ఫోన్ సంభాషణ పూర్తయాక ఆమెకెందుకో అసంతృప్తి అన్పించింది. రవి తనతో మరికొద్దిసేపు మాట్లాడి ఉంటే బావుండేదనిపించింది.

ఆమెకు చాలాసేపు అశాంతిగా అన్పించింది.

మనసుని కుదుటపర్చుకోడానికి పాత ఉత్తరాల్ని ఆశ్రయించింది. ఆ పదాల్లో సాంత్వన వెతుక్కుంది. మొదట్లో రెండ్రోజులకోసారి ఫోన్ వచ్చేది.

"అమ్మా! బావున్నావా? ఆరోగ్యం ఎలా ఉంది?" లాంటి రొటీన్ పదాలు తప్ప అందులో ఆత్మీయతా స్పర్శ కొరవడింది. మొదట్లో వాడి గొంతు వినటం హాయిగా ఉండేది. రాను రాను ఆ గొంతులోని మార్దవతకన్నా గుండెల్లోని తడి మాటలుగా మారి వెలువడటం లేదన్న స్పృహ బాధాకరంగా పరిణమించింది.

ఫోన్ పెట్టించాక ఉత్తరాలు రావడం ఆగిపోయాయి. పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూడటంలో ఉన్న ఒకప్పటి థ్రిల్ ఆమెకు దూరమైంది. అతను "సుందరమ్మా! ఈ రోజు మీ అబ్బాయి నుంచి ఉత్తరం లేదు" అన్న వెంటనే కలిగే కుంగుబాటు . . . రేపు తప్పకుండా వస్తుందన్న ఆశ . . . ఉత్తరం వచ్చిన రోజు ఎగిరి ఆకాశాన్ని అందుకున్నంత ఆనందం . . . మరలా ఎదురుచూపు . . . ఆత్మీయవ్యక్తి రాకకోసం ఎదురుచూస్తున్నంత ఆశగా . . . ఆర్తిగా . . .

గంటలతరబడి ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని చెవులు రిక్కించి వింటూ ఉండటం, తీరా మోగాక – "ఎలా ఉన్నావమ్మా" అనే సాధారణమైన పలకరింపుతో హతాశురాలవటం . . . ఆ తర్వాత అనంతమైన దుఃఖభారాన్ని మోస్తున్నట్లు రోజంతా గడపటం . . .

వాడు ఫోన్‌లో మాట్లాడిన మాటల్ని నెమరువేసుకుని ఆనందిద్దామన్నా . . . ఒక్క మాటా గుర్తుకు రాదు. వీణ తంత్రుల్ని వేలి కొసలు మీటినంత మధురంగా, హృదయ తంత్రులపైన ఏ పదమూ సుతారంగా వాలదు.

ఆమెకీమధ్య జీవితం దుర్భరంగా తోస్తోంది. అంతా శూన్యం. దేనిమీదా ఆసక్తి కలగటం లేదు. అన్నీ మృతప్రాయమైన క్షణాలు. మొదట్లో గువ్వ పిట్టలా కన్పించిన టెలిఫోన్ ఇప్పుడు గుడ్లగూబలా భయపెడుతోంది. కొన్ని కోట్ల క్షణాల అంతరం తర్వాత మోగే ఫోన్ తంత్రుల్లోంచి వెలువడేవి ధ్వని తరంగాలు తప్ప లయాత్మకమైన స్వరఝురీ తరంగాలు కావవి.

ఒకప్పుడు ఫోన్ మోగుతుందన్న ఆశతో ఎదురు చూసేది. ఇప్పుడు ఆమెని ఆవరించిన నిర్లిప్తత . . . మోగితే ఏమిటి? మరింత గాయం చేయటం తప్ప . . . వాడి నుంచి ఏదో ఆశించటం . . . అది దొరక్క నిరాశకు గురి కావటం . . . నిస్పృహ . . . నిస్సత్తువ . . .

ఫోన్ మోగకపోవటమే మంచిదన్న ఆలోచన. మోగకపోతే 'అయ్యో! వీడు కనీసం అమ్మా, ఎలా ఉన్నావు అనైనా అడగటం లేదే' అన్న ఆరాటం. తీరా వాడు ఆ నాలుగు మాటలు మాట్లాడి పెట్టేశాక 'అయ్యో! వాడు నాతో సరిగ్గా మాట్లాడలేదే' అన్న బాధ. ఇదంతా ఒక వలయంలా మారి ఆమెను అల్లుకుని, చుట్టుకుని, చక్రబంధంలో బిగించినట్లు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఆర్నెల్లు ఆరు యుగాల్లా భారంగా గడిచాయి.

ఆమెకిక దుస్సహమన్పించింది. ఉగాది ఇంకో వారం ఉందనగా ఫోన్ మోగింది. అయిష్టంగా ఆమె ఫోన్ దగ్గరకు నడిచింది.

"అమ్మా! ఎలా ఉన్నావు? ఉగాది నీకిష్టమైన పండగ కదా. నీకేమైనా గిఫ్టుగా పంపాలనుకుంటున్నానమ్మా. నేనే ఏదో ఒకటి పంపటం కంటే నీక్కావల్సింది పంపిస్తే

బావుంటుంది కదా. ఏం కావాలో అడుగమ్మా” అన్నాడు రవి.

“నాకెందుకురా గిఫ్టులు? అయినా నాకేం తక్కువైందని?” అందామె.

“అలా కుదరదమ్మా! నువ్వెప్పుడూ నోరు తెరిచి నాకిది కావాల్రా రవీ అని అడగలేదు. ఈసారి నువ్వడగాలి. నేను పంపించాలి. అంతేనమ్మా” అన్నాడు.

ఆమె అర నిమిషం ఆలోచించి, “సరేరా రవీ! నాకేం కావాలో నేను ఉత్తరంలో రాస్తాలే” అని పెట్టేసింది.

వెంటనే ఆమె తన కొడుక్కి ఉత్తరం రాయడానికి కూచుంది.

“బాబూ! మానవ సంబంధాలు మెరుగుపడాలంటే సమాచార వ్యవస్థ బలంగా ఉండాలన్న విషయం నాకు తెలుసు. ఉత్తరం కన్నా ఫోన్ సౌకర్యం ఆధునికమైందనీ తెలుసు. కానీ ఆధునికత ముసుగులో మనం అనుబంధాల్ని జారవిడ్చుకుంటున్నామేమో అనిపిస్తోంది.

రెండేళ్ళ క్రితం మన పోస్టుమాన్ వెంకయ్య సంచినిండా ఉత్తరాలు పెట్టుకుని సైకిల్‌మీద ఇల్లిల్లూ తిరిగేవాడు. మన వూరికి టెలిఫోన్ వచ్చాక పిడికిట్లో పదో పాతికో ఉత్తరాల్తో కన్పిస్తున్నాడు. జీవితంలో వేగం పెరిగింది. ఉత్తరం రాసేంత తీరిక ఎక్కడుందీ అంటూ ప్రతివాడూ ఫోన్లో మాట్లాడేస్తున్నాడు. ప్రతి దానికీ ఫోన్ వాడేస్తున్నారు. నాకెందుకో ఉత్తరం అవసానదశకు చేరుకుందనిపిస్తోంది. అత్యవసరమైన విషయాన్ని క్షణాల్లో చేరవేసే అద్భుతమైన సాధనం ఫోన్. వ్యాపార లావాదేవీలకు చాలా అనువైన సాధనం టెలిఫోన్. దాని ఉపయోగం అంతవరకే.

మన జీవితాలతో పురాతనకాలం నుండి పెనవేసుకుపోయింది ఉత్తరం. మన హృదయాన్ని అక్షరాలుగా కాగితం మీద పేర్చటం ఉత్తరం ద్వారానే సాధ్యపడుతుంది.

పొడిగా పరామర్శించడానికి పనికి వచ్చే ఫోన్ సంభాషణ నాకు రుచించటం లేదురా అబ్బాయ్. అలాగని ఫోన్ తీసేయమని నేనను. నాకు అనారోగ్యం చేసినా, ప్రాణాలు పోయే పరిస్థితి దాపురించినా నీకు కబురందించడానికి ఫోన్ ఉండాలి. కానీ దానికి తల్లీకొడుకుల మధ్య కబుర్లు మోసుకెళ్ళేంత ఆర్ద్రత లేదురా. గుండెలోని తడి స్పర్శ చేరవేయడం దానికి చాతకాదు.

ఉగాదికి నాకేం కావాలో అడగమన్నావుగా? నాకో ఉత్తరం రాయి బాబు . . .

ఉత్తరాన్ని చంపొద్దు. అది నాలాంటి తల్లుల వాత్సల్యం మోసుకెళ్ళి బిడ్డల్ని లాలించగలదు. అమ్మ ఆశలకు అనుగుణంగా కొడుకుల ఆత్మీయతల్ని చేరవేయగలదు. అందుకేరా రవీ . . . నాకు ఉత్తరం రాయి. ఇకనించీ ఉత్తరాలే రాయి. అమ్మకోసం ఆ మాత్రం సమయం నీకు దొరుకుతుందనే ఆశిస్తాను.

మనలాంటివాళ్లైనా కొనవూపిరితో వున్న ఉత్తరానికి వూపిరి వూదకపోతే అది చచ్చిపోతుందిరా. మనం దాన్ని బతికించుకోవాలి.

ఉత్తరం బతికుండాలి. నాలాంటి వాళ్ళని బతికించాలి.

నీ ఉత్తరం కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తూ - అమ్మ".

ఆమె కళ్ళ నుండి జారిన రెండు కన్నీటిబొట్లు ఆ ఉత్తరం మీద తమ సాక్షి సంతకం చేశాయి.

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక - 12 సెప్టెంబర్, 2002)*